క్లుప్తంగా

నేడు నాలుగు పంచాయతీల్లో ఎమ్మెల్యే కళావతి ప్రచారం

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు, వండువ, బిటివాడ, ఎం.వి.పురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వండువ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రిటైర్డ్ డీటీకి సన్మానం



బుచ్చయ్య దంపతులను సత్కరిస్తున్న ఫాదర్ భరత్‌రెడ్డి, క్రైస్తవ సోదరులు

పాలకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి ఇటీవల పదవీ విరమణ గావించిన బొమ్మలాట బుచ్చయ్య దంపతులను స్థానిక ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ భరత్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. రెవెన్యూ వ్యవస్థలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం బుచ్చయ్య దంపతుల పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురంలోని రైల్వే లైన్ పక్కన ఇన్‌లైన్ పోల్స్, కేబుల్ వర్క్స్ నిర్వహించనున్న కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 33 కేవీ నాగూరు ఫీడర్, 33 కేవీ మేరంగి ఫీడర్ పరిధిలోని గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆ శాఖ ఈఈ బి.త్రినాధరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రజలు తాగునీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం




బాబా అలయంలోని హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమము పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకములు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు నర్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమము పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీని ఓడించండి

భామిని: అరకు పార్లమెంటు సీపీఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సయ్య తరఫున ఆ పార్టీ స్థానిక నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. భామిని, బొడ్డగూడ, మణిగ పంచాయతీల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీజేపీని ఓడించాలని కోరారు. ప్రచారంలో సీపీఎం నాయకులు గొర్లె జగన్నాయకులు, సిర్ల ప్రసాద్, కె.మిన్నారావు, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు సరఫరాకు చర్యలు



ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో జలజీవన్ మిషన్(జేజేఎం) ద్వారా చేపట్టిన ఇంటింటి కుళాయిల పనులు పూర్తికావడంతో ప్రలకు తాగునీటి సమస్య తీరనుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. గాదెలవలసలో ఓవర్ హెడ్‌ట్యాంక్, అండర్ గ్రౌండ్ పైప్‌లైన్లను ఆదివారం ఏఈ ఆర్.పవన్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గతంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి ఇంతవరకు అరకొరగా తాగునీరు సరఫరా అయ్యేదన్నారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులు రూ.58 లక్షలతో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ట్రైల్‌రన్ పూర్తిచేసి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



సుంకిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని సుంకి, కొంకడివరం, సీతారాంపురం, దళాయివలస, ఉద్దవోలు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మే 13న జరగనున్న ఎన్నికలలో మరోసారి ఫ్యాను గుర్తుపై ఓటును వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్ అందించినట్లుగా రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలను అందజేయలేదన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మనకు మళ్లీ కావాలంటే, ఈ ఎన్నికల్లో జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అందరికీ మేలు చేసే జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఎమ్మెల్యేగా తనను, అరకు ఎంపీగా డా.తనూజారాణిని గెలిపించేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ ఆశించిన సమసమాజ స్థాపన మాటలలో కాకుండా చేతలలో చూపించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ జి.నారాయణమ్మ, ఎంపీటీసీ బి.గౌరమ్మ, నాయకులు డి.ధనుంజయరావు, వాకాడ కూరిమినాయుడు, ఉరిటి యాదవ్, సింహాచలం, ఓలేటి జనార్దననాయుడు, నల్ల రవికుమార్, బి.త్రినాధరావు, సిహెచ్.గంగునాయుడు, గులిపల్లి శ్రీనివాసరావు, బొంగు కోటేశ్వరరావు, బాణాల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉంటాం...

- మూలలంక సర్పంచ్ బిడ్డిక కమలమ్మ



మూలలంకలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: జనసేనలో తాము చేరినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని వీరఘట్టం మండలంలోని మూలలంక గ్రామ సర్పంచ్ బిడ్డిక కమలమ్మ తెలిపారు. ఆదివారం తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ, జనసేన నాయకులు ఓటు అడిగేందుకు తమ వద్దకు వచ్చారని, మా గ్రామం నుండి బయటకు వెళ్లిన వెంటనే సోషల్ మీడియాలో మూలలంక సర్పంచ్ జనసేనలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె తెలిపారు. మేము గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, ఎమ్మెల్యే కళావతికి అండగా ఉంటామని గ్రామస్తులంతా పేర్కొన్నారు. తమ గ్రామం నుండి ఒక్క ఓటు కూడా జనసేనకు పడదన్నారు. అనంతరం ఈ గ్రామానికి వచ్చిన ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు విలేకర్లతో మాట్లాడారు. జనసేనలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. టీడీపీ వాళ్లే ఆ పార్టీలో చేరి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఓటమి భయంతోనే ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, భోగి మణి, శంభాన శ్రీను, గెంబలి మహేష్ పాల్గొన్నారు.

గెడ్డగూడలో నీటి సమస్యకు చెక్

సీతంపేట మండలంలోని గెడ్డగూడ గ్రామంలో దశాబ్దాల మంచినీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో 20కి పైగా కుటుంబాలున్నాయి. కొన్నేళ్లుగా తాగునీటికి ఇక్కడి ప్రజలు ఇబ్బందుతు పడుతూనే ఉన్నారు. సుదూర ప్రాంతంలో గెడ్డ నీటిని తెచ్చుకుంటూ కాలం నెట్టుకొచ్చేవారు. దీంతో వ్యాధుల బారిన పడేవారు. టీడీపీ పాలనలో వీరి సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక మంచినీటి సమస్యకు చెక్ పెట్టింది. గెడ్డ నుంచి పైప్‌లైన్ ద్వారా మినీ వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసింది. సోలార్ రక్షిత మంచినీటి పథకాన్ని కూడా ఏర్పాటు చేయడంతో గిరిజనులు సంబరపడుతున్నారు. – సీతంపేట





గ్రామ శివారున ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ (ఇన్‌సెట్) గెడ్డ నీటిని తీసుకువెళ్తున్న యువతి

బ్యాలెట్ ఓటింగ్‌పై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వరహాలు

పాలకొండ:

ఓటు ఫ్రం హోమ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇప్పటికే ఓటు కోసం దరఖాస్తులు అందించారని, ఇటువంటి వారికి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. మే 5 నుండి 9 వరకు జరిగే బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాట్లును సరిచూసుకోవాలన్నారు. ఎక్కడా సమస్యలు లేకుండా చూడాలన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

పార్వతీపురంటౌన్: పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన గౌతమిని జట్టు ఆశ్రమ ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. ఆశ్రమ నిర్వాహకులు పద్మజ విద్యార్థినిని సత్కరించి ఆశ్రమం తరపున నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమం సభ్యులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం

సాలూరు రూరల్: మండలం కొట్టుపరువు గ్రామంలో రూ.9 లక్షలతో తాగునీటి ట్యాంక్ నిర్మించారు. గతంలో ఉన్న వాటర్‌ట్యాంక్ శిథిలమవడంతో దానిస్థానంలో 20 వేల లీటర్ల సామర్థ్యంతో నూతన ట్యాంక్‌ను నిర్మించారు. దీని నుంచి పైపులైన్ల ద్వారా గ్రామంలోని ప్రతీ ఇంటికీ తాగునీరు సరఫరా చేసేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే జోగారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌వీ నివాస ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వివిధ స్థాయి కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో 58 నెలల పాటు చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, అందులో పేర్కొన్న హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు కొయ్యాన శ్రీవాణి, జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, పార్టీ మండల సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, ఎస్.రామకృష్ణ, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ యు.సురేష్‌కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో రుణమాఫీ ఒట్టి మాటే..

పాలకొండ రూరల్: టీడీపీ హయాంలో రైతు రుణమాఫీ ఒట్టి మాటగానే మిగిలిపోయింది. వ్యవసాయం దండగన్న చంద్రబాబు 2019 ఎన్నికల సమయంలో కూడా నిస్సిగ్గుగా అన్నదాతలపై వల్లమాలిన ప్రేమ ఒలకబోసే యత్నం చేశారు. బడాయి బాబు.. లడాయి హామీలను విశ్వసించని ప్రజలు నిన్నునమ్మం బాబు అంటూ తిరస్కరించారు. బాబు జమానాలో రైతు రుణమాఫీ కోసం కాస్తా అవలోకం చేసుకుంటే 2014 ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు గ్రామ స్థాయిలో ఓటు కోసం బేషరతుగా రైతులకు ఉన్న రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని నమ్మబలికి అధికారం చేపట్టారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా వారి హయాంలో రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేసారు.ఆ సమయంలో అధికారిక లెక్కల ప్రకారం పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఈ టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 24 వేల 236 మంది రైతులకు సంబంధించి రూ.77కోట్ల 55 లక్షల రైతు రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. కేవలం పాలకొండ మండలానికి సంబంధించి 9వేల 762 మంది రైతులకుగాను రూ.30 కోట్ల 35 లక్షలు చెల్లించాలి. నాడువిదిల్చిన మొత్తాలతోవాస్తవానికి 55 శాతం మేర రైతులకు కూడా న్యాయం జరగలేదు. అప్పట్లో వారు చేసిన అప్పులకు దాదాపు ఐదేళ్లు వడ్డీలు చెల్లించారు. చంద్రబాబు ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరిట అందించిన పత్రాలు కేవలం రైతును మభ్యపెట్టడానికే పరిమితమయ్యాయి. కాస్తోకూస్తో వచ్చిన మొత్తాలు వడ్డీలకే పరిమితమయ్యాయి. నాడు రుణమాఫీ తొలి మూడు విడతలు మినహాయిస్తే 4, 5 విడతలకు సంబంధించి కనీసం నగదు బ్యాంకులకు జమ కాలేదు. నాటి ప్రభుత్వం కేవలం లెక్కల గారడీ చేసి రైతును నిలువునా ముంచేసింది. ఈ క్రమంలో అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2015–16 సంవత్సరాల నడుమ భామిని మండల పరిధిలో ఆరుగురు రైతులు పురుగు మందును సేవించి బలవన్మరణానికి పాల్పడటమే ఇందుకు నిదర్శనమని నేటికి అన్నదాతలు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు, పొత్తు నాయకులను నమ్మే ప్రసక్తి లేదంటున్నారు.

అవమానం మూటగట్టుకోవాల్సి వచ్చింది



రుణమాఫీ పేరిట చంద్రబాబు తన పాలనలో సగటు రైతును నిండా అప్పుల ఊబిలోకి నెట్టాడు. ఆయన ప్రభుత్వంలో లెక్కల ప్రకారం నాకు రూ.1.50లక్షలు రుణమాఫీ వర్తించాలి. రెండు విడతల్లో రూ.12వేలు అందించారు. అటుపై అప్పుకు పత్రాలు అందించారు. మూడవ విడత నుంచి నగదు జమకాకపోవటం, ఇచ్చిన మొత్తం వడ్డీకి సరిపోవటం జరిగింది. దాదాపు ఐదేళ్ల కష్టం, పండిన పంటల దిగుబడి చేసిన అప్పు తీర్చేందుకే సరిపోయింది. తీరా ప్రభుత్వం ఇచ్చిన పత్రాలతో బ్యాంకులకు వెళ్తే అవమానం మూటగట్టుకోవాల్సి వచ్చింది. అందుకే బాబు హామీలను రైతులు విశ్వసించరు – **వంజరాపు కొండలరావు, రైతు, బుక్కూరు, పాలకొండ**

అంతా బూటకమే..



రైతులను నిమ్మించి మోసం చేయడంలో టీడీపీ ప్రభుత్వం ముందంజలో ఉంటుంది. బాబు పాలనలో అన్నదాతలు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఆయన గ్రహబలం అలాంటిది మరి. రుణమాఫీ పేరిట రైతును నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చాడు. శతశాతం రైతుల రుణాలు మాఫీ చేసేశామని ప్రకటించాడు. మళ్లీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరిట చిత్తు కాగితాలు ఇచ్చి దగా చేశారు. చంద్రబాబు హామీలు, మాటలు అంతా బూటకమే. ఆయన చేసిన మోసాన్ని రైతులు, వారి కుటుంబాలు మరువలేదు. అమలు చేయని హామీలతో ప్రజలను బురిడీ కొట్టిస్తాడు. ఇప్పుడు ఎవరూ ఆయనను నమ్మే పరిస్థితి లేదు.

– **బలగ మన్మథరావు, రైతు, పాలకొండ**

ప్రజల మనిషి జగనన్న



పాలకొండ రూరల్: కళావతికి కాలనీలో హారతులు పడుతున్న గ్రామస్తులు

- ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: ప్రజల కష్టం తెలిసిన నాయకుడు, ఆ కష్టాలను తన కష్టంగా భావించి తీర్చే నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను పంపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. మండలంలోని బుక్కూరు, కాలనీ, టీకే రాజపురం, బెజ్జి పంచాయతీల్లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ప్రచారానికి వచ్చిన కళావతి వెంట ఆయా గ్రామాల ప్రజలు అడుగు కదిపారు. ఆమెకు విజయ తిలకం దిద్దారు. ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మన భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలన్నారు. ప్రజలను మోసపుచ్చే కుట్రదారులకు బుద్ధి చెప్పాలన్నారు. మన సంక్షేమం కోరి మన గడప వద్దకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత జగనన్నదన్నారు. మనమంతా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కలసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, సలహా మండలి అధ్యక్షులు వంజరాపు కొండలరావు, వి.జనార్ధనరావు, శివ్వాల శ్రీనివాసరావు, నల్లి శివప్రసాద్, లిల్లీ పుష్పనాథం, రణస్థలం రాంబాబు, చిన్నారావు, గురునాయుడు, గవర ప్రవీణ్‌కుమార్, గోగుల కల్యాణి, తిర్లంగి ఉపేంద్రకుమార్, జనార్ధనరావు, కరణం నానిబాబుతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం కావాలి

- మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



శిఖబడిలో ప్రచారం నిర్వహిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కురుపాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని ఆ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. జియ్యమ్మవలస మండలం అల్లువాడ, శిఖబడి, బీజేపురం, బొమ్మిక, రామభద్రపురం గ్రామాలలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలను మరోసారి గుర్తు చేశారు. ప్రచారంలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, వైస్ సర్పంచ్ ఎర్ర భార్గవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మానుష్యం



ఉదయానికే జనసంచారం లేని కూడలి రోడ్డు

భామిని: మండలంలో రోజురోజుకు భానుడు భగభగలు పెరుగుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో రహదారులు నిర్మానుష్యమవుతున్నాయి. అత్యవసర పనులుంటే తప్ప ఎవరూ బయటకు రావడం లేదు. 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు.

ఘనంగా స్వామి తిరువీధి



పల్లకిలో స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

భామిని: మండలంలోని పెద్దదిమిలిలో వెలసిన అలివేలి మంగ సమేత శ్రీవేంకటేశ్వర ఆలయ 8వ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి తిరువీధి నిర్వహించారు. భక్తుల నమో వెంకటేశ అంటూ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ముందుగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు



పెదమేరంగి సెంటర్ వద్ద బోర్ మరమ్మతు పనులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి సెంటర్ వద్ద ఆదివారం బోర్ మరమ్మతు పనులు చేపట్టారు. పరిసర గ్రామాల ప్రజలకు కూడలి కావడంతో వేసవి దృష్ట్యా బోర్ మరమ్మతు పనులు చేపట్టినట్లు సర్పంచ్ రాయిపల్లి అనూరాధ తెలిపారు. సుమారు 15 గ్రామాల ప్రజలు ఇక్కడకు వచ్చి ప్రయాణం చేస్తారని, వేసవి తీవ్రత వలన తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు మరమ్మతులు చేపట్టారని తెలిపారు. బోర్ మెకానిక్ తిరుపతిరావుచే దగ్గరుండి మరమ్మతులు చేపట్టారు.

కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న ప్రజలు

జియ్యమ్మవలస: మండలంలోని సీమనాయుడువలస, బట్లబద్ర, వెంకటరాజపురం, పెదమేరంగి కూడలిలో వారం రోజుల నుంచి కుక్కలు తిరుగుతూ మనుషులను గాయపరుస్తున్నాయి. ఇటీవల 10 మంది మహిళలపై ఇష్టానుసారం దాడి చేసి కాలు, చేతులపై దాడి చేసి భయాందోళనకు గురి చేశాయి. వెంకటరాజపురంలో ఒక్కరోజే ముగ్గురిని గాయపరచి కోమాలోకి వెళ్లే పరిస్థితి వచ్చింది. ఆదివారం ఆవుదూడపై దాడి చేసి గాయపర్చాయి. చేసేది లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలల చిత్రలేఖనంలో సోమేష్ ప్రతిభ



మెమొంటోను అందుకొంటున్న సోమేష్

గరుగుబిల్లి: నేషనల్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్‌లో మండలంలోని సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట గ్రామానికి చెందిన పి.సోమేష్ ద్వితీయ బహుమతి సాధించారు. విజయవాడలోని డా.అంబేడ్కర్ సోషల్ జస్టిస్ విగ్రహం వద్ద తెలుగు వరల్డ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో డా.బిఆర్.అంబేడ్కర్ అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన బాలల చిత్రలేఖనం పోటీలలో పాల్గొని బహుమతి సాధించారు. సోమేష్ నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రూ. 3వేలు నగదు బహుమతితో పాటు మెమొంటోను ఈ నెల 27న విజయవాడలో జరిగిన సమావేశంలో సోమేష్ అందుకున్నాడు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరచడం పట్ల ప్రముఖ నఖచిత్రకారుడు పల్లపరిశినాయుడుతో పాటు పలువురు అభినందించారు.

గుడ్ మార్నింగ్ వీరఘట్టం



వీరఘట్టం బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: గుడ్ మార్నింగ్ వీరఘట్టం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక బీసీ కాలనీలో ఆదివారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోను వివరించారు. అమలు చేయగలిగే హామీలు మాత్రమే జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తారని, మాట ఇస్తే కచ్చితంగా ఇచ్చిన హామీలు నెరవేర్చుతారన్నారు. ఈ విషయాన్ని గత ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి రుజువు చేసారని వీరు బీసీ కాలనీ ఓటర్లుకు వివరించారు. సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగించేందుకు వస్తున్న జనసేన అభ్యర్థిని నమ్మవద్దని కోరారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిని, ఎంపీ అభ్యర్థి తనూజారాణిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మాళి హేమలత, శంభాన శ్రీను, కడగల రమణ, బొద్దూరు రామ్మూర్తి, జంపు శేఖర్ పాల్గొన్నారు.